నేడు లష్కర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, జనవరి 21: విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా వసంతపురి, లాలాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్దేశించిన సమయాల్లో నేడు (బుధవారం) విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ విద్యుత్ శాఖ ఏడీఈ అధికారులు తెలిపారు. వసంతపురి ఫీడర్ పరిధిలోని శ్రీపురి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఇందిరానగర్, లాలాపేట్ కమాన్ గణేశ్ టెంపుల్, ఇసుకబాయి, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే శాంతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, జనప్రియ అపార్ట్‌మెంట్, శోభకుమార అపార్ట్‌మెంట్, ఆర్యన్ నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది.

23న ఇందిరాపార్కు వద్ద నిరసన ధర్నా

కవాడిగూడ, జనవరి 21: డాక్టర్ గ్రహం స్టెయిన్స్ ఆస్ట్రేలియన్ మిషనరీ 26వ వర్ధంతి సందర్భంగా దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ దినేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ (ఎన్‌సీఐసీ) ఆధ్వర్యంలో 23న ఇందిరాపార్కు వద్ద నిరసన ధర్నా, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ నాయకులు తెలిపారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఎంబీ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీఐసీ అధ్యక్షుడు సీఏ డానియల్ ఆడమ్స్, చర్చి చైర్మన్ ఏసీటీ ప్రకాశ్, జీపీ ప్రవీణ్‌కుమార్ తమన్నా పాల్గొని నిరసన ధర్నా, సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమంలో విశ్రాంత జడ్జీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, బిషప్, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. క్రైస్తవులు, లౌకికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు.

గాడి తప్పిన 'కంటోన్మెంట్'

- బోర్డులో ప్రజాప్రతినిధులు లేక ఐదేండ్లు
- విలీనం లేదు.. ఎన్నికలు లేవు...
- ఎన్నికలపై కమ్ముకున్న నీలి నీడలు
- సమస్యలు తీరక జనం ఇక్కట్లు

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్, జనవరి 21: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నానాటికీ పాలన గాడి తప్పుతోంది. బోర్డుకు ఎన్నికలు లేక ఐదేండ్లుగా కావొస్తున్నా నామినేటెడ్ సభ్యుడిని మాత్రమే నియమిస్తూ కేంద్ర రక్షణ శాఖ ప్రజల బాధలను గాలికి వదిలేసింది. ఓ వైపు జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం అంటూనే, మరో వైపు నేడు, రేపు అంటూ ఊరిస్తూ వస్తున్న బోర్డు ఎన్నికలపై సైతం నీలి నీడలు కుమ్ముకున్నాయి. ఇటీవల కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ దేశంలోనే 56 కంటోన్మెంట్‌లకు మరోసారి ఏడాది పాటు నామినేటెడ్ సభ్యులను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బోర్డు ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే అనే సంకేతం తేటతెల్లమైంది. ఐదేండ్లుగా బోర్డులో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో బస్తీలు, కాలనీల్లో ప్రజా సమస్యలు తీరడం లేదు. బోర్డు కార్యాలయం చుట్టూ జనం చెప్పులు అరిగేలా తిరుగుతున్నా సమస్య మాత్రం తీరడం లేదు.

విలీనం లేదు సరే.. మరి ఎన్నికలు?

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందనే ప్రకటనలే తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదు. బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి స్థానిక పురపాలిక, నగరపాలికల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా, సంబంధిత విధి విధానాలను కూడా జారీ అయినప్పటికీ ఆ వైపు కనీసం దృష్టి సారించడం లేదు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఒకవేళ కంటోన్మెంట్ విలీనం అయితే ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలన్నీ జీహెచ్ఎంసీకి ఉచితంగా బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరిస్తుంది. మరోవైపు జీహెచ్ఎంసీ పాలక మండలి ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. అప్పటి వరకు కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేసి, జీహెచ్ఎంసీలో అంతర్భాగంగానే ఈ ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నప్పటికీ ఇది సాధ్యమయ్యే పనికాదని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేతల్లో నామినేటెడ్ ఆశలు...

బోర్డు ఎన్నికలు జరుగుతాయని ఇటీవల లీకులు రావడంతో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కాళ్లకు బలపాలు కట్టుకొని ఆయా వార్డుల్లో చక్కర్లు కొట్టారు. బోర్డు మాజీ సభ్యులుగా ఉన్న నేతలు ఐదేండ్లుగా ఆయా వార్డుల్లో నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉంటూ వస్తున్నారు. బోర్డు అధికారులతో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా మరోసారి నామినేటెడ్ సభ్యుడినే నియమించేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికల నిర్వహణపై మబ్బులు కమ్ముకోవడంతో ఆశావహుల ప్రణాళికలు నీరుగారి పోయారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 21: చిరు వ్యాపారాలు చేసుకునే వారిని ఇబ్బందులకు గురి చేయొద్దని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లకు చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కార్యాలయంలో కలిసి వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 ఏండ్ల తెలంగాణ ప్రభుత్వంలో ఏ రోజు కూడా వ్యాపారులను ఇబ్బందులు పెట్టలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష్య సాధింపు చర్యలతో ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈనెల 23న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి మినిష్టర్ రోడ్డు, జవహర్ జనతా, మోండా మార్కెట్‌లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఫుట్‌పాత్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 21: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లి క్యాంపు కార్యాలయంలో అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్లకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడపడుచు పెండ్లికి ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆర్థికంగా చేయూతనివ్వాలనే ఆలోచనలతో తెలంగాణ ప్రభుత్వం షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు, రెవెన్యూ అధికారులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విషయంలో.. బీ కేర్ ఫుల్

తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కోటిక్ బ్యూరో డీసీపీ శివనాయుడు

బొల్లారం, జనవరి 21: విద్యార్థులు, యువత చెడు దారులకు ఆకర్షితులవకుండా శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డీసీపీ శివనాయుడు అన్నారు. మంగళవారం తిరుమలగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణపై తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డీసీపీ శివనాయుడు, శంకర్‌యాదవ్ హాజరయ్యారు. డీసీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో మనిషిలోని పరివర్తనను పూర్తిగా నశింపజేసి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. విద్యార్థి దశలోనే కొందరు డ్రగ్స్, గంజాయికి బానిసలై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ అధికారులు, ఎస్సై ఆంథోనమ్మ, సైకాలిజిస్టు శ్రీపూజ, ప్రధానోపాధ్యాయుడు రమణ మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ విడుదల

మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట, జనవరి 21: అడ్డగుట్టలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల నిర్వహణ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైద్రాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో జరగబోయే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్‌బాబు, జోన్ నాయకులు ఆర్.మల్లేశ్, మధు, గోపాల్, ఎల్లయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో దొంగల అరెస్టు

కార్వాన్, జనవరి 21: చోరీలకు పాల్పడుతన్న ఇద్దరు దొంగలను గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజు వివరాలు జనవరి 16న భోజగుట్టలోని వివేకానందనగర్‌కు చెందిన ఉప్పరి క్రిష్ణ తన గ్రామానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించి పాత నేరస్తులైన పవన్, సయ్యద్ అజీంలను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి వస్తువులు, రూ.1,87,000 నగదుతో పాటు యాక్టివా, ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

పదోన్నతులపై చర్యలు తీసుకోవాలి

ఓయూలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

సికింద్రాబాద్, జనవరి 21: ఓయూలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలపుట్టను ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తేటతెల్లం చేసిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారి ఆర్టికల్స్ పరిశీలించి, యూజీసీ కేర్ లిస్టు, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్‌లో లేవని నిర్ధారించిందన్నారు. అర్హత లేకుండా సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందిన వారిని తక్షణమే తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ సీనియర్లుగా అర్హత లేకున్నా ఓయూ మాజీ వీసీ, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ అక్రమాలకు పాల్పడిన వారిలో ఉన్నారని ఆరోపించారు. వీరే కాకుండా వివిధ కళాశాలల మాజీ, ప్రస్తుత ప్రిన్సిపాళ్లు, విభాగ అధిపతులు, పీఠాధిపతులు కూడా ఉన్నారని తెలిపారు. వారందరిపైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి భగత్, హైదరాబాద్ సహాయ కార్యదర్శి కళ్యాణ్, నాయకులు వంశీ, అరుణ్ పాల్గొన్నారు

నేటి తరానికి మార్గదర్శి దామెర్ల రామారావు

సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

కవాడిగూడ, జనవరి 21: నేటి తరాలకు ఆధునిక చిత్రకళలో దామెర్ల రామారావు మార్గదర్శి అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా దామెర్ల రామారావు యాదిలో మంగళవారం సంస్మరణ కార్యక్రమం జరిపారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ దామెర్ల చిత్రకళపై పలు ప్రయోగాలు చేసి పాశ్చాత్య చిత్రకళను ప్రాంతీయతతో మిళితం చేశారన్నారు. ఆయన సృజించిన చిత్రకళ దామెర్ల శైలిగా గుర్తింపు పొందిందని తెలపారు. కార్తీక పౌర్ణమి, తూర్పు కనుమల గోదావరి వంటి ప్రసిద్ధమైన చిత్రాలు ఆయన ప్రాంతీయతను ప్రతిబింబింప జేస్తాయన్నారు. సభాధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ దామెర్ల చిత్రకళా ప్రదర్శనను ఆనాడు గాంధీజీ ప్రారంభించడం విశేషమన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు నైషధం సత్యనారాయణ మూర్తి, గాయకుడు కె.శివకుమార్, గాయని మల్లాది ఉష తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

కాచిగూడ,జనవరి 21: బీసీలకు ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. డిక్లరేషన్‌ను అమలుచేయాలని కోరుతూ మంగళవారం కాచిగూడ టూరిస్ట్ హోటల్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 శాతం ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే నివేదికను తక్షణమే ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చాడని, వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

రేణుకనగర్ ఈస్ట్‌లో అగ్నిప్రమాదం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అమీర్‌పేట్, జనవరి 21: బల్కంపేట రైల్వే ట్రాక్‌కు ఆనుకున్న ఉన్న రేణుకనగర్ ఈస్ట్‌లోని ఓ గ్యాస్ సిలెండర్ల గోడౌన్ సమీపంలో చెలరేగిన మంటలు స్థానికంగా ఆందోళన రేకెత్తించింది. మంగళవారం రాత్రి 8.10 గంటలకు అందిన సమాచారం మేరకు సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ట్రాక్‌కు ఆనుకుని ప్రహరీ లోపల చెత్త, ఇతర వ్యర్థాలున్న ప్రదేశంలో మంటలు తలెత్తాయి. అయితే గ్యాస్ గోడౌన్ సిబ్బంది కూడా సకాలంలో అగ్నిమాపక పరికరాల వినియోగంతో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు చేయడంతో పెద్ద ఉపద్రవమే తప్పింది. ఇదిలా ఉంటే కాలనీ మధ్య కొనసాగుతున్న గ్యాస్ గోడౌన్ వల్ల తమకు ప్రమాదమేనని, గోడౌన్ సురక్షత ప్రదేశాలకు తరలించాలని కోరుతూ కాలనీవాసులు గతంలో అనేక ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. గోడౌన్ పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అగ్నిమాపక సిబ్బంది సంస్థ ప్రతినిధులకు సూచించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు దోహదపడుతుందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన డి.పూజ బాధితురాలి భర్త ఉదయ్‌యాదవ్‌కు మంగళవారం బోయిన్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.52 వేల చెక్కును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్‌తో కలిసి అందజేశారు. న్యూ బోయిన్‌పల్లిలోని పెన్షన్‌లైన్ బస్తీకి చెందిన సలీమాబేగం ఆనారోగ్యంతో బాధపడుతోంది. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్వోసీ పత్రాన్ని మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి బాధితురాలి భర్త మహ్మద్ యూసఫ్‌కు అందజేశారు. కార్యక్రమంలో హసీన్‌ఖాన్, రిజ్వాన్, ఇమ్రాన్, చోటు పాల్గొన్నారు. – బొల్లారం:

ఉత్సాహంగా వయోధికుల క్రీడలు

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న వయోధికులు

అమీర్‌పేట్, జనవరి 21: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసరా సర్కిల్ కమిటీ (ఖైరతాబాద్) ఆధ్వర్యంలో వయోధికులకు ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారు. మోడల్‌కాలనీ వయోధికుల మండలి కార్యాలయ ఆవరణలో ఆసరా సర్కిల్ ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను ఖైరతాబాద్ డీసీ రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోధికులను చురుగ్గా ఉంచేందుకు ఇటువంటి క్రీడలు మరిన్ని జరగాల్సిన అవసరముందని తెలిపారు. పోటీల నిర్వహణలో ఖైరతాబాద్ ఆసరా సర్కిల్ ఉపాధ్యక్షుడు జేఎస్టీ శాయి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఏఎంవోహెచ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి చదరంగం, యూసీడీ పీవో శ్రీనివాస్ కారమ్స్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి అధ్యక్షుడు బీపీ దూబే, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి, మాణిక్‌రావు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 21: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తి(55)మంగళవారం విద్యానగర్–కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. సిమెంట్ రంగు టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 871256 8495 లో సంప్రదించాలని కోరారు.

ఏపీ సంపర్క్‌క్రాంతి రైల్లో చోరీ

ఏపీ సంపర్క్‌క్రాంతి రైల్లో ప్రయాణికుని ల్యాప్‌ట్యాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాలు.. కర్నూల్‌కు చెందిన శ్రీహరి (19)రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్నూల్ రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కర్నూల్‌కు బదిలీ చేసిశారు.

త్రినాథరావుకు గాన సుధా సాగర బిరుదు

త్రినాథరావును సత్కరిస్తున్న స్వామి తదితరులు

కవాడిగూడ, జనవరి 21: హైదరాబాద్ కళాకారుడు డాక్టర్ చింతపూడి త్రినాథరావుకు చత్తీస్‌గడ్ రాజధాని రాయపూర్‌లో అరుదైన గౌరవం లభించింది. సంగీత రంగానికి త్రినాథరావు చేసిన సేవలను గుర్తించిన ఆంధ్ర అసోసియేషన్ రాయ్‌పూర్ ఆధ్వర్యంలలో ఆయనను గాన సుధా సాగర బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ ఘంటశాల శతజయంతి సందర్భంగా సంవత్సరం పాటు రోజుకో పాట చొప్పున 366 ఘంటసాల పాటలు పాడి రికార్డు నెలకొల్పిన త్రినాథరావును తమ సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా సత్కరించుకోవడం తమకు లభించిన గొప్ప అవకాశమన్నారు. తెలుగు వారు నివసించే పొరుగు రాష్ట్రమైన చత్తీస్‌గడ్‌లో తనకు సన్మానం జరగడం చాలా సంతోషం కలిగించిందన్నారు. ఇదే వేదికపై జానపద నాట్య కళాకారులు నటరాజ్‌భట్‌ను సత్కరించారు. సభా కార్యక్రమం అనంతరం త్రినాథరావు మధురమైన పాటలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ పట్నాయక్, ఖానోజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు, పోలీసు సిబ్బంది

మారేడ్‌పల్లి, జనవరి 21: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై రెజిమెంటల్‌బజార్‌లోని హిల్ స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా, మైనర్లు వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. సేఫ్ ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు వివరించారు. వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రూల్స్ పాటిస్తూ వాహనాలను నడుపాలని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

బేగంపేట్: ట్రాఫిక్ నియమాలు పాటించి భవిష్యత్‌ను కాపాడుకోవాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ సూచించారు. బేగంపేట్‌లోని వెస్లీ కాలేజ్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రోడ్డు దాటుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఇన్‌స్పెక్టర్ పాపయ్య, సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. చిలకలగూడ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. ర్యాష్ డ్రైవింగ్ చూడకూడదని, అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వినియోగం, మెట్రో అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

బొల్లారం: ఏడోవార్డు లాల్‌బజార్ హోలీ ఫ్యామిలీ పాఠశాలలో తిరుమలగిరి రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనం నడుపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకూడదని, విద్యార్థులు తమ తల్లితండ్రులకు సూచించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.